క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2023- 24 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని రామంతపురం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 1వ తరగతిలో లక్కీ డ్రా ద్వారా ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సునీత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఎస్సీ విద్యార్థులు ఈనెల మే 1లోగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 62815 10601 సంప్రదించాలని కోరారు.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

ఆదిలాబాద్: యువత పోటీ ప్రపంచంలో రాణించాలంటే అన్ని రంగాల్లో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో శనివారం సాయి లింగి శిరిడి సాయి సేవ సొసైటీ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. స్వచ్ఛంద సంస్థలు ఉచిత శిక్షణలను అందించడం అభినందనీయమన్నారు. డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సాజిద్‌ఖాన్

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించే సత్యాగ్రహ సభను కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేయడం, ఆయనపై కేసు నమోదు చేయడం, ఇంటిని ఖాళీ చేయడాన్ని నిరసిస్తూ.. సోమవారం సత్యాగ్రహ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు అడే గజేందర్, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, నారాయన్ రెడ్డి, జాహెద్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తాం

బోథ్: బోథ్ మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం సర్పంచ్ సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. కాలనీల్లో స్తంభాలను ఏర్పాటు, సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు, చేతిపంపుల రిపేర్ చేయించాలని తీర్మానించారు. ఉప సర్పంచ్ పల్లవి, వార్డు సభ్యులు షేక్ షాకీర్, తుకారాం, వినయ్, లక్ష్మి, మశ్చేందర్, రాజమణి, లక్ష్మి, తస్లీమ్ బేగం, నందయ్య, ఆసిఫ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సురేందర్ అన్నారు. శనివారం మండలంలోని దేహగమ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. అపరిచిత మేసెజ్‌లకు రిప్లై ఇవ్వద్దన్నారు. యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొనాల వాసికి దళితరత్న అవార్డు

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన గంగయ్యకు దళిత రత్న అవార్డు దక్కింది. ఈమేరకు శనివారం రవీంద్రభారతిలో అవార్డును అందుకున్నారు. బీఆర్ అంబేద్కర్ 132వ జయంతి ఉత్సవాల సందర్భంగా అవార్డును అందుకున్నారు. గ్రామస్తులు ఆయనకు అభినందించారు.

నేటి నుంచి రంజాన్ కిట్ల పంపిణీ

కైలాస్‌నగర్: ప్రతి ఏడాది మాదిరిగానే ఈఏడాది కూడా మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిల్కూరి రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ చేస్తామని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి తెలిపారు. శనివారం శాంతినగర్‌లోని సీఆర్ఆర్ నివాసంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16న రంజాన్ కిట్ల పంపిణీని ప్రారంభిస్తున్నామన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాసం నర్సింగ్‌రావ్, మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావ్ పాటిల్, కౌన్సిలర్ అంబకంటి అశోక్, సైద్ ఖాన్, వసీమొద్దీన్, ప్రవీణ్, నహీద్ పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధి చైర్మన్‌ను కలిసిన భూమారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమాకమైన గెల్లు శ్రీనివాస్ యాదవ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కారించి అభినందనలు తెలిపారు.



హలీం తయారు చేస్తున్న నిర్వాహకులు



హలీం విక్రయ కేంద్రం

ఆహా.. హలీం

- జిల్లాలో ప్రత్యేక విక్రయ కేంద్రాలు
- తినేందుకు జనం ఆసక్తి
- అరేబియన్ వంటకాలకు భలే గిరాకీ

ఆదిలాబాద్: రంజాన్ పర్వదినం ముస్లింలకు అతి ప్రధానమైన పండుగ. రంజాన్ మాసంలో దైవాన్ని స్మరిస్తూ ఆయన చూపిన సన్మార్గంలో నడవడానికి ముస్లింలు ప్రయత్నిస్తారు. ఉపవాసం సమయంలో నిష్ఠగా ఉంటూ ఉపవాస విరమణ సమయంలో సాంప్రదాయ వంటకాలను ఆహారంగా తీసుకుంటారు. సాంప్రదాయ వంటకాల్లో హలీం వంటకానిది ప్రత్యేక స్థానం.

ఇరాన్ టూ హైదరాబాద్..

హైదరాబాద్ హలీం ప్రపంచ వ్యాప్త గుర్తింపు సొంతం చేసుకున్నప్పటికీ హలీం ఓ అరేబియన్ వంటకం. ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఈవంటకం హైదరాబాద్‌కు పరిచయమైనట్లు చరిత్రకారులు చెబుతుంటారు. ఇరాన్ దేశం నుంచి హైదరాబాద్ నగరానికి వలస వచ్చిన ఒక కుటుంబం నగరంలోని పాతబస్తీ ప్రాంతంలో మదీనా సర్కిల్ వద్ద హోటల్ ప్రారంభించి, హలీం విక్రయాలను హైదరాబాదీలకు పరిచయం చేసినట్లు చెబుతారు.

బలవర్ధకమైన మాంసాహారం..

హలీం వంటకంలో అన్ని పోషకాలు సంపూర్ణంగా లభించడం వలన దీనిని సింగల్ డిష్ మీల్ అని పిలుస్తుంటారు. హలీం రుచికరమైన వంటకమే కాకుండా ఆరోగ్యానికి సైతం ఎంతో మేలు చేస్తుంది. సుమారుగా 12 గంటల పాటు ఉపవాసం ఉండి హలీం శక్తి లభించడమే కాకుండా పూర్తి భోజనంతో సమానమైన పోషకాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. హలీం తయారీలో వాడే మాంసం, నెయ్యి పదార్థాల పరిమాణాన్ని బట్టి కేలరీల పరిమాణం ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు.

సందడిగా విక్రయ కేంద్రాలు..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో హలీం విక్రయ కేంద్రాల వద్ద సందడి మొదలైంది. ముస్లింలు మసీదులలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్షల విరమణ కోసం హలీం విక్రయకేంద్రాల వద్దకు చేరుకుంటుండటంతో కిటకిటలాడుతున్నాయి. మరోవైపు అన్నివర్గాల వారు పార్సిల్స్ తీసుకెళ్తుండడంతో హలీంకు భలే గిరాకీ పెరిగింది.

30 సంవత్సరాలుగా..

గత 30 సంవత్సరాలుగా హలీం వంటకాన్ని వండుతున్నాను. హలీం తినేందుకు చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. వినియోగదారులు పెద్దఎత్తునే కొనుగోలు చేయడానికి వస్తున్నారు. డబల్ కా మీటా, చికెన్ స్టిక్స్, చికెన్ లెగ్ పీస్ వంటకాల కొనుగోలు చేస్తున్నారు.

– రవూఫ్ ఖాన్, హలీం విక్రయ కేంద్రం నిర్వాహకుడు

సాంప్రదాయ వంటకం

హలీం ఎంతో రుచికరంగా ఉంటుంది. ఇది సాంప్రదాయ వంటకం కూడా. అందుచేత ఉపవాస దీక్ష విరమణ సమయంలో హలీం ఉండేటట్లు చూసుకుంటాం. పిల్లలు కూడా ఎంతో ఇష్టంగా తింటారు.

– ఇమ్రాన్, హలీం ప్రియుడు, ఆదిలాబాద్

అనేక ప్రయోజనాలు

హలీం వంటకం ఎంతో ఆరోగ్యాన్ని కలగజేస్తుంది. ఇందులో బలవర్ధకమైన పోషకాలు ఉంటాయి. హలీం తినడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే హలీం తినడానికి ప్రాధాన్యతనిస్తాము.

– ఖల్లూ, హలీం ప్రియుడు, ఆదిలాబాద్

జీపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



నేరడిగొండలో..



బోథ్: సమ్మె నోటీసు అందజేస్తున్న కార్యదర్శులు

- సమ్మె నోటీస్ అందజేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

నేరడిగొండ: సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన విధంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) సంఘం నాయకులు జి.రాజేశ్వర్‌రావు, ఎ.శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో శోభనలకు సమ్మె నోటీసు అందజేశారు. నాలుగు సంవత్సరాలు పూర్తయినా.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజ్‌కు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. సమస్య పరిష్కరం కాకపోతే ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బోథ్: తమను రెగ్యులైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ.. బోథ్ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సమ్మె నోటీస్ అందజేశారు. శిక్షణ కాలం ముగిసిన రెగ్యులర్ చేయకపోవడాన్ని నిరసిస్తూ సమ్మె నోటీసు అందించామన్నారు. ఈనెల 28నుంచి సమ్మె చేస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తాం

తాంసి: పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని భీంపూర్ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సాయి అన్నారు. శనివారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గత నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్నా.. ప్రభుత్వం రెగ్యులర్ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు నర్సయ్య, జలేందర్, పూజ, సాయినంద పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో సురేశ్, ఎంపీవో హతుల్ కుమార్‌లకు సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ వార్షికోత్సవం



బేలలో ఆర్ఎస్ఎస్ ర్యాలీ

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ జైనథ్ ఖండ, బేల శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టారు. కళాశాల మైదానంలో చేసిన ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విభాగ్ సహ జిల్లా కార్యవహ దిగాంబర్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ ఎవరికీ వ్యతిరేకం కాదనీ, దేశద్రోహులకు మాత్రమే వ్యతిరేకమన్నారు. స్వయం సేవక్‌లు హిందూ ధర్మ పరిరక్షణ, సంఘటితం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవహ గుమ్మ కొమురయ్య, జిల్లా ప్రచారక్ మధు, మానుస్మారే అతుల్, స్వయం సేవక్‌లు చంద రాజు, గుండవార్ శ్రీనివాస్, నాందేవ్, రాము, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

కూలిన కంద్ర వాగు వంతెన



బోథ్: మండల కేంద్రంలోని కంద్రె వాగు వంతెన ఒకవైపు కూలింది. ఇప్పటికే శిథిలావస్థ చేరి ప్రమాదకరంగా మారింది. సర్పంచ్ సురేందర్ యాదవ్ వంతెనను పరిశీలించి, వాహనాలు, ప్రజలు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు దృషికి తీసుకెళ్లి, నూతన వంతెన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. గతకొంత కాలంగా ఇక్కడ వంతెన నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

విగ్రహ నిర్మాణానికి విరాళం

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామంలో హనుమాన్ విగ్రహ నిర్మాణానికి నేరడిగొండ ఉప సర్పంచ్ దేవేందర్ తనవంతు రూ. 10 వేలను విరాళం శనివారం నిర్మాణ కమిటీకి అందించారు. కార్యక్రమంలో బద్దం ప్రమోద్ రెడ్డి, గూడురు వంశీరెడ్డి, మోర శ్రీనివాస్ రెడ్డి, మధు మోహన్ రెడ్డి, నవీన్ రెడ్డి, అల్వే శేఖర్, సోలంకి దీక్షిత్, ఉదయ్ పాల్గొన్నారు.

దహెగాంలో ఇఫ్తార్

బేల: మండలంలోని దహెగాం గ్రామంలోని మసీదు ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఆదిలాబాద్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ రంగినేని మనీషా పవన్‌రావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. మౌలానాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, విందును స్వీకరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్కే మహ్మద్, కాందేకార్ ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంద్రవెల్లి సీహెచ్‌సీ వైద్యులు కోరారు. శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. సమక, పాటగూడ, మారుతి గూడ గ్రామ ప్రజలకు వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ శ్రీనివాస్, సర్పంచ్ సోయం రంభాబాయి, లక్ష్మిబాయి పాల్గొన్నారు.

షెడ్డు ప్రారంభం

తాంసి: మండల కేంద్రంలోని మసీదులో నూతనంగా నిర్మించిన షెడ్డును శనివారం సర్పంచ్ కృష్ణ ప్రారంభించారు. పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన షెడ్డును ముస్లిం సోదరులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ షరీఫ్, కాంత్ రెడ్డి, రామన్నయాదవ్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో తాగునీటి ఎద్దడి నివారణ కోసం చర్యలు తీసుకోనున్నట్లు ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి తెలిపారు. కాలనీవాసుల కోరిక మేరకు కాలనీలో పర్యటించారు. ఆయన వెంట ఎంపీటీసీ నిమ్మల శివకుమార్‌రెడ్డి ఉన్నారు.

పరామర్శ

ఉట్నూర్: మండల కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ మాజీత్ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు జాదవ్ సుమన్ బాయి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు.

సఖీ సేవలపై అవగాహన



పోస్టర్ విడుదల చేస్తున్న నామమణి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని సఖీ కేంద్రం లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కేస్ వర్కర్ నాగమణి అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయి వైకుంఠ ట్రస్టులో టేలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ తీసుకుంటున్న మహిళలకు సఖీ కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. కౌన్సిలింగ్, పోలీస్ సహాయం, న్యాయ సలహాలు, వైద్య సహాయం, తాత్కాలిక వసతి అందించడం జరుగుతుందన్నారు. అత్యవసరం ఉంటే 181, 100, 1098లకు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి స్వప్నిల్, ట్రైనింగ్ టీచర్స్ పూజ, వీణ, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. శిథిలావస్థలో చెక్‌డ్యాం



తలమడుగు: మండలంలోని లక్ష్మింపూర్ సమీపంలోని వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం శిథిలావస్థకు చేరుకుంది. సగం భాగం కొట్టుకుపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: సాగర్, ఇరిగేషన్ జేఈ, ఫోన్: 94915 57916

డ్రెయినేజీపై అక్రమ నిర్మాణం

- కన్నెత్తి చూడని మున్సిపల్ యంత్రాంగం



డ్రెయినేజీపై చేపట్టిన నిర్మాణం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఖాళీ స్థలం కన్పిస్తే చాలు, కబ్జానే అన్నట్లుగా పరిస్థితి మారింది. మున్సిపాలిటీకి సంబంధించి రోడ్లు, డ్రెయినేజీల స్థలాలను సైతం అక్రమార్కులు వదలడం లేదు. భుక్తాపూర్ కాలనీ పరిధిలోకి వచ్చే బస్టాండ్ డౌనల్ ప్రాంతంలో డ్రెయినేజీని అక్రమించి భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా స్థలం ఖాళీగా ఉండడంతో దానిపై అక్రమార్కులు కన్నేశారు. ఇంకేముంది దర్జాగా డ్రెయినేజీని అక్రమించుకుని భవన నిర్మాణాలు చేపట్టారు. బయటకు కనిపించకుండా చుట్టూ రేకులు పెట్టారు. దాదాపు పనులు స్లాబ్ లెవల్‌కు చేరుకున్నాయి. ఇంత జరుగుతున్నా.. బల్దియా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సాయి కిరణ్‌ను వివరణ కోరగా.. సిబ్బందిని పంపించి విచారణ జరిపిస్తామన్నారు. అక్రమమని తేలితే నిర్మాణాన్ని కూల్చివేయిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న బోథ్ జడ్జి హుస్సేన్

నేరడిగొండ: ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోథ్ జడ్జి హుస్సేన్ అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వడూర్ రైతువేదికలో సర్పంచ్ గాదె సమత అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. చిన్నచిన్న తగాదాలను గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలన్నారు. విద్యహక్కు, మోటార్ వెహికిల్, బాల్య వివాహాలు, భూతగాదాలు, లోక్ అదాలత్‌లు గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రెటరీ పంద్రం శంకర్, న్యాయవాదులు ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్‌కుమార్, పీసీ మోహన్, కోర్టు సిబ్బంది, స్రవంతి, సంగీత, ఉప సర్పంచ్ షేక్ ఫయ్యాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని మేజిస్ట్రేట్, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీమతి దుర్గారాణి అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని లోకారి(బి)లో, నార్నూర్ మండలంలోని ఉమ్రీ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, మోటర్ వెహికిల్ చట్టాలపై, వరకట్న వేధింపులుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ ప్రేంకుమార్, ఎస్సై రవికిరణ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

వైభవంగా విషు పూజ మహోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బేల్లూరి అయ్యప్ప ఆలయంలో శనివారం విషు పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక హారతులు, కలశాభిషేకం, పది నెట్టంబడి పూజ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, విషు పూజ నిర్వాకులు తాటి పెల్లి శివ ప్రసాద్, మూర్తి గురుస్వామి, సాయి దుబే, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంభోజి సూర్యకాంత్, దాముఖ రవీందర్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



డీఎస్పీతో మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం చేపట్టిన ర్యాలీలో జరిగిన ఘర్షణకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. గరువారం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఉమేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం రాత్రి ఆదిలాబాద్‌లో ఓ వర్గానికి చెందిన యువకులని మరోవర్గానికి చెందిన యువకులు గుంపుగా వచ్చి దాడి చేయడం దుర్మార్గమన్నారు. కొంతమంది రాజకీయ లబ్ధికోసం దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, యువకులు ఉన్నారు.